నేడు యథావిధిగా జిల్లావ్యాప్తంగా స్పందన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రతి వారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మున్సిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన ఫిర్యాదులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

సాగు, తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు

జెడ్‌పి సమావేశంలో మంత్రి వేణు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రానున్న వేసవి కాలంలో సాగు, తాగునీటికి రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి వేణుతోపాటు, ఎంపి వంగా గీత, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాలలో చైతన్యవంతమైన కృషి చేస్తూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ పాలకమండలి రెండున్నర సంవత్సరాల కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. ఇందుకు అన్ని విధాలా కృషి చేసిన సభ్యులు, సహకరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 2023-24 సంవత్సరానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సవరణ బడ్జెట్ ను, 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందు ఉంచాలని ఆయన జడ్‌పి సిఇఒను కోరారు.

2023 - 24 బడ్జెట్ ఆమోదం

వివిధ పద్దుల కింద రూ.883.34 కోట్లు ఆదాయం, రూ.882.79 కోట్ల వ్యయం అంచనాలుగా రూ.55 లక్షల మిగులుతో ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలను, రూ.886.95 కోట్ల ఆదాయం, రూ.886.33 కోట్ల వ్యయం అంచనాలతో రానున్న 2024-25 సంవత్సరానికి రూ.62 కోట్ల మిగులుతో అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను జెడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామచంద్ర మూర్తి పద్దుల వారీగా సమగ్రంగా వివరించి చర్చ, ఆమోదం కోసం సభ ముందు ఉంచారు. వివిధ అంశాల కింద ప్రతిపాదించిన కేటాయింపుల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సభ ఈ ప్రతిపాదనలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

వేసవిలో ఎద్దడి లేకుండా

అనంతరం సమావేశంలో చేపట్టిన అజెండా సమీక్షలో తొలుత చేపట్టిన గ్రామీణ నీటి సరఫరా అంశం కింద రానున్న వేసవి మాసాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు కార్యాచరణ చర్యల గురించి వివరించాలని సభ్యులు అధికారులను కోరారు. మూడు జిల్లాల పరిధిలోని అన్ని సమ్మర్ స్టోరేస్ ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు చేపడతామని, బోరు బావుల ముందస్తు ఫషింగ్ నిర్వహిస్తామని, తాగునీటి ఎద్దడి ఎదురైన ఆవాసాలకు ట్యాంకుల రవాణా ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సభ్యులు వివరించారు. జల జీవన్ మిషన్ కింద చేపట్టిన స్టోరేస్ ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికి తాగునీటి సరఫరాకు పైపులైన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని పలువురు సభ్యులు అధికారులు కోరారు. గోదావరి చెంతనే ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెట్ట, డెల్టా ప్రాంతాలు వేసవి మాసాల్లో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని, జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులను సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దిష్ట కాల పరిధిలో సకాలంలో పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అధికారులను కోరారు. వ్యవసాయ శాఖ సమీక్షలో రబీ పంటలకు అవసరమైన ఎరువులు, అపరాల పంటలకు అవసరమైన విత్తనాలకు ఇటువంటి కొరతలేదని అధికారులు వివరించారు. గోదావరి కాలువల వ్యవస్థ కింద తాళ్లరేవు, కాజులూరు మండలాల్లోని శివారు భూములకు, ఏలేరు వ్యవస్థలో శివారున ఉన్న పిఠాపురం ప్రాంత భూములకు సాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీ వంగా గీత, పలువురు జెడ్‌పిటిసి సభ్యులు కోరారు. రబీ పంటలకు సాగునీటి సమస్య తలెత్తకుండా వ్యవసాయ ఇరిగేషన్ శాఖల సమన్వయంతో వంతులవారీ విధానాన్ని అమలు పరుస్తున్నామని కలెక్టర్ కృతికాశుక్లా సభ్యులకు తెలిపారు.

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అమలవుతున్న పనులు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల ద్వారా చేపట్టిన పనులు ప్రగతిని సభ సమీక్షించింది. విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ పాఠశాలకు విలువైన కంప్యూటర్లు, అత్యాధునిక బోధన పరికరాలు ప్రభుత్వం సమకూర్చుతోందని, వీటి భద్రతకు పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని సభ్యులు సూచించారు. మంత్రి వేణు మాట్లాడుతూ పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయని అన్నారు. సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నూపూర్ అజయ్, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, జెడ్‌పి వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతన్న మంత్రి వేణు, చైర్మన్ విప్పర్తి, ఎంపీ, కలెక్టర్

రాజమండ్రిలో అభ్యర్థులతో కలిసి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు

గ్రూప్స్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదవాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రూప్స్, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులు క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ అవ్వాలని ఎంఎల్‌సి, పోటీ పరీక్షల నిపుణుడు కెఎస్.లక్ష్మణరావు సూచించారు. యుటిఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, వీరేశలింగం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో గ్రూప్స్, డివైఇఒ పోటీ పరీక్షల అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది. జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున గ్రూప్స్ అభ్యర్థులు హాజరుయ్యారు. సదస్సు ప్రారంభ సభలో ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ అభ్యర్థులు సిలబస్‌పై పట్టు కలిగి ఉండాలని, ప్రీవియస్ పేపర్లు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రశ్నలను బాగా అవగాహన చేసుకున్న తర్వాతే సమాధానం రాయాలని తెలిపారు. భారత సమాజం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే రెండు సబ్జెక్టుల నుంచి 60 మార్కులకు పేపర్ ఉంటుందని ఇవి అన్నీ స్పెషలైజేషన్ సబ్జెక్టుల వారికి కీలకమైనవని తెలిపారు. ఈ రెండు సబ్జెక్టులపై మూడు గంటలపాటు అవగాహన కల్పించారు. మరో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా గ్రూప్స్, డిఎస్‌సి ఇతర పోటీ పరీక్షలు నిర్వహించకుండా, రాష్ట్రంలో సుమారు 2,50,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్‌లో కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అరకొర పోస్టులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 50,000 టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 6000 ఒప్పంద పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే గ్రూప్స్, డిఎస్‌సి పోస్టుల సంఖ్యలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, వీరేశలింగం విజ్ఞాన కేంద్రం నాయకులు జె.రూపస్ రావు మాట్లాడారు. అనంతరం వెయ్యి మందికి ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇవిఎస్‌ఆర్.ప్రసాద్, ఎన్.రవిబాబు, కె.రమేష్‌బాబు, సిహెచ్.దయానిధి, ఎం.విజయగౌరి, కెవిఎస్.ప్రకాష్, చిలుకూరి శ్రీనివాస్, డివైఎఫ్‌ఐ సభ్యులు ఎన్.సాయి ప్రసాద్, బి.పవన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఇ.భాస్కర్, జ్యోతి, కనక, మహేష్, దుర్గ పాల్గొన్నారు.

తహశీల్దార్ దంపతులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-పెరవలి

తహశీల్దారుగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన టి.రాజరాజేశ్వరి బదిలీపై వెళ్లడంతో ఆదివారం తహశీల్దారు కార్యాలయంలో సిబ్బంది రాజరాజేశ్వరి ఆమె భర్త ఉండ్రాజవరం తహశీల్దారు గొట్టుముక్కల కనకరాజును ఆదివారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో పని చేసినప్పుడు ప్రతి ఒక్కరూ తనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారన్నారు. తాను నాయకులు, సామాన్య ప్రజలు అభిమానం పొందానని చెప్పారు. మండలంలోని ప్రతి ఒక్కరితో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని, విధి నిర్వహణలో తనకు సహకరించిన కార్యాలయ సిబ్బందికి ధన్యవాదములు తెలిపారు.

కాంగ్రెస్ రచ్చబండ కార్యక్రమం స్థల పరిశీలన

ప్రజాశక్తి-చాగల్లు

ఈ నెల 9న పిసిసి అధ్యక్షురాలు షర్మిల రచ్చబండ కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్న నేపథ్యంలో చాగల్లు అంబేద్కర్ విగ్రహం వద్ద రచ్చబండ స్థలాన్ని కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఆదివారం పరిశీలించారు. జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొణిదెల శ్రీనివాస్, నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, బొనిగే రాంబాబు, జొన్నకూటి రవి, గడ్డం సాయిబాబా, మీసాల సత్యనారాయణ, బండి విజయభాస్కర్, సాయన సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్వాడీల విజయోత్సవ సభ

ప్రజాశక్తి-పెరవలి

అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వెంటనే జిఒలు విడుదల చేయాలని అంగన్వాడీ విజయోత్సవ సభలో ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం పెరవలిలో ప్రాజెక్టు అంగన్వాడీల విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీల ఐక్యతను ఆయన కొనియాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలపై త్వరలో జిఒలు విడుదల అవుతాయన్నారు. అంగన్వాడీలు సుదీర్ఘంగా చేసిన పోరాట ఫలితమే మిగతా యూనియన్లకు కూడా దిశా నిర్దేశం అవుతుందని అన్నారు. పెరవలి ప్రాజెక్టు ప్రెసిడెంట్ కంకటాల లక్ష్మీ కుమారి, నాయకులు కృష్ణవేణి, మాధవి, విజయనిర్మల, పార్వతి, ధనలక్ష్మి, నాగవేణి, రామలక్ష్మి, రంగ నాయకి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జువ్వల రాంబాబు

మహిళల పేరు మీదే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- చాగల్లు

రాష్ట్రంలో ప్రతి సంక్షేమ పథకాలు మహిళల పేరు మీదనే ఇస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని గోపాలపురం ఎంఎల్‌ఎ, వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక తెలగా సంఘం ఆడిటోరియం ఆవరణలో నిర్వహించిన నాలుగో విడత వైయస్సార్ ఆసరా సంబరాల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చాగల్లు మండలంలో 1,234 గ్రూపులకు గాను 12,365 మంది డ్వాక్రా మహిళలకు రూ.11 కోట్ల 13 లక్షల 70, వేల చెక్కును అందజేశారు. మొత్తం నాలుగు విడతల్లో చాగల్లు మండలానికి రూ.44 కోట్ల 52 లక్షల 61 వేలు కేవలం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద ఇచ్చినట్లు చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనన్ని సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలోఎంపిపి మట్టా వీరస్వామి, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైసిపి నాయకులు చెల్లింకల దుర్గ మల్లేశ్వరరావు గంద్రోతు సురేంద్ర, గారపాటి శ్రీనివాస్, ఆత్కూరి దొరయ్య, సుంకర రాయుడు, పొన్నాడ సింహాద్రి, జట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-పెరవలి

ఖండవల్లి గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొన్న కౌలు రైతు తుమ్మూరి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జువ్వల రాంబాబు. ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ కుటుంబాన్ని వారు పరామర్శించారు. రాంబాబు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు సుమారు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నాశనం అవడంతో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వ పరంగా ఉన్న అప్పులను రద్దు చేసి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్యుల సేవా గుణం గొప్పది

ప్రజాశక్తి-గోపాలపురం

సమాజంలో ఆర్య వైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. ఏలూరు సిఆర్. రెడ్డి కాలేజి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు అర్బన్ జిల్లాల ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార ఉత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ.. గోపాలపురం నియోజకవర్గానికి చెందిన వెలగా శ్రీరామమూర్తి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షునిగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఆయనకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వారికి ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రాజానగరం

ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ఆధ్వర్యాన పలువురు ఆదివారం వైసిపిలో చేరారు. జనసేన పార్టీకి చెందిన ఎంపిటిసి వల్లభశెట్టి వెంకటరమణ, వంద యువకులకు ఎంఎల్‌ఎ రాజా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. తొలుత జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి మీదుగా భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూలం పెద్ద, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, రాయపురెడ్డి చిన్న, ప్రగడ చక్రి, సంగీత ప్రసాద్ పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన మార్గాని

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి శ్రీనివాసులును ప్రముఖ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడియం పోలీసు స్టేషన్‌కు వచ్చిన డిఎస్‌పికి పూల మొక్కను అందించి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ విధుల్లో నిష్పక్షపాతంగా, వ్యవహరించే అధికారుల్లో శ్రీనివాసులు ఒకరిని అన్నారు.

పలు కుటుంబాలకు కుందుల పరామర్శ

ప్రజాశక్తి-పెరవలి

మల్లేశ్వరంలో ఇటీవల మరణించిన మండేపూడి అన్నపూర్ణ, దువాపు సూరయ్య కుటుంబలను టిడిపి సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. కోటిపల్లి మురళీకృష్ణ, జనసేన నాయకుడు మేడిచర్ల భాస్కర్ శివకుమార్, బొలిశెట్టి సత్య గణపతి, కోటిపల్లి వెంకట రామారావు, మల్లేశ్వరం, కోటిపల్లి విఘ్నేశ్వరుడు, మేడిచర్ల జగన్ మోహన్‌రావు, కోటిపల్లి శ్రీనివాస్, గుమ్మళ్ల నరసింహారావు, ఎం.పవన్ ఉన్నారు.

వికలాంగునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

భీమోలు గ్రామ పంచాయతీ తొక్కిరెడ్డి గూడెంకు చెందిన వికలాంగుడు చవలపాటి నాగేంద్రకు జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు సౌజన్యంతో ఆదివారం వీల్ చైర్, ఆర్థిక సహాయం అందజేసారు. నాగేంద్రకు గతంలో ప్రమాదంలో కాళ్లు విరగడంతో మంచానికే పరిమితం అయ్యాడు. ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణకు అవస్థ పడుతుండడంతో సువర్ణ రాజు ఆధ్వర్యాన ఆ కుటుంబానికి సాయం అందించారు. పోసిన గణపతి, సూర్యభగవాన్, ఉమ మహేశ్వరావు, కృష్ణ, దేవీ వరప్రసాద్, ఫణీంద్ర, బాలు, వేణు, రాజు, శ్రీను, రామారావు, వీరమళ్ల శ్రీను, నరేంద్ర, నరేష్, ప్రగడ రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు అడుగడుగునా డొల్ల

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో అడుగడుగునా డొల్లతనం బయట పడుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక పుష్కరాల రేవు సమీపంలో... గోదావరి రైల్వే స్టేషన్‌ను అనుకుని ఏర్పాటు చేసిన పుష్కర ప్లాజాను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న టైల్స్‌ను మీడియాకు చూపించారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ పుష్కర ప్లాజా ఏర్పాటులో నాణ్యతా ప్రమాణాలు ఏ మాత్రం పాటించలేదన్నారు. ఈ ఒక్క దానిలోనే కాదని నగరంలో చేపట్టిన, చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని ఆరోపించారు. ప్రజాధనంతో చేపట్టే ఏ అభివృద్ధి పనైనా సరే భవిష్యత్తులో ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేపట్టాలని, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులన్నీ చాలా నాణ్యతతో చేసినవి కనుకే ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఇప్పటి అలానే ఉన్నాయన్నారు. ఎంపీ భరత్ రామ్, ఆయన అనుచరులు చేసే పనుల్లో నాణ్యత లేదని చెప్పేందుకు పుష్కర ప్లాజా వద్ద చేసిన పనుల్లో బయట పడిన డొల్లతనమే నిదర్శనమన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ నగర పాలక సంస్థ కమిషనర్‌కు తెలిసినా ఎంపీ భరత్ రామ్ ఒత్తిడి వల్ల ఆయన ఏ చర్య తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టిడిపి నగర కమిటీ కోశాధికారి శెట్టి జగదీష్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు తవ్వా రాజా, టిడిపి నాయకులు మాటూరి సిద్ధు, ఎంఎన్ రావు, నల్లం ఆనంద్, గ్రంధి రాజా, కొత్త రాజేష్, సిహెచ్.శివ, పింకేష్, నారాయణ వెంట ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి వాసు

కుల కట్టుబాట్లతో కుటుంబం వెలి

ప్రజాశక్తి - సీతానగరం

సభ్యసమాజం తలదించుకునేలా కులకట్టుబాట్లతో కుటుంబాన్ని వెలివేసిన సంఘటన చినకొండేపూడిలో చోటు చేసుకుంది. వడ్డీలపేటలో సరిహద్దుల తగాదాలో కుల పెద్దలు రెండుసార్లు తగువు పెట్టారు. తగవులో బాధిత కుటుంబాన్ని పెద్దలు దూషించడంతో పాటు దౌర్జన్యంగా కొట్టడానికి సిద్ధమయ్యారు. అనంతరం కులంలో జరిగే మంచి చెడుల కార్యక్రమాల్లో పాల్గొనరాదని అన్నారని బాధితురాలు కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగేరు సుబ్బమ్మ పిల్లలతో ఉమ్మడిగా కలిసి ఉంటున్నారు. సుబ్బమ్మ కుటుంబం కుల పెద్దల నుంచి న్యాయం జరగలేదని పోలీసులను ఆశ్రయించారు. కుల పెద్దలను కాదని పోలీసులకు ఫిర్యాదు చేశారనే కారణంతో ఆ కుటుంబాన్ని కుల కట్టుబాట్లు పాటించాలని సంఘ బహిష్కరణ చేసి, కుల సంఘంలో ఉన్న అందరికీ చెప్పారు. వారితో మాట్లాడకుండా వారికి ఏ విధమైన సహాయ సహకారాలు ఇవ్వకుండా వారి పిల్లలతోను, పెద్దలతోనూ బహిష్కరించిన కారణంగా సంబంధాలు నెరపరాదని పెద్దలు ఆదేశించారు. శనివారం బాధిత కుటుంబ సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబం

ఉత్సాహంగా రోటరీ సభ్యుల సమ్మేళనం

ప్రజాశక్తి-నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం అట్లపాడులోని బృందావన్ విల్లాస్‌లో రోటరీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ రోటరియన్ గాలి రాఘవయ్య మాట్లాడుతూ రోటరీ ద్వారా సమాజ నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల సేవలు సభ్యులు అందించాలని కోరారు. క్లబ్ ప్రెసిడెంట్ గుంపుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీలో మరింత మంది సభ్యులు చేరాలని తద్వారా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ నిడదవోలు అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కేదారశెట్టి రవి కుమార్, సెంట్రల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెచ్చెట్టి ఫణి సింహ, ఇంజే ఝాన్సీ రాణి, ఇంజే శేఖర్, చైతన్య బాబు, సత్య ప్రసాద్, ఆకుల రాజీవ్, కొయ్య కృష్ణంరాజు, రాపాక వెంకట్రావు, గల్లా రాజు, గుంపుల మమత, ఆనందం మురళి, ఎల్లే ప్రసాద్, మట్టాడ గోవిందరాజులు, గాయత్రి, ఈద రమేష్ పాల్గొన్నారు

సమ్మేళనంలో పాల్గొన్న రోటరీ సభ్యులు

టిడిపిలోకి సీతా రామకృష్ణ

గోకవరం : తంటికొండ గ్రామానికి చెందిన డివివి సూర్యనారాయణ కుమారుడు దాసరి సీతా రామకష్ణ ఆదివారం తెలుగుదేశంలో చేరారు. గతంలో సూర్యనారాయణ గ్రామ సర్పంచ్‌గా, ఎంపిపిగా పని చేశారు. ఆయన వారసుడిగా సీతా రామకష్ణ రాజకీయ ప్రవేశం చేశారు.టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బదిరెడ్డి అచ్చన్న దొర, మలిరెడ్డి సిరి, బదిరెడ్డి రవి, గంటిపూడి శ్రీధర్, వెంకటపతి, గడ్డం బాబు, వెంకన్న దొర, వెంకటేశ్వరరావు, నాగు, నరేష్, రాము, రాయుడు, వెంకటేష్, శ్రీను, సురేష్, రమేష్ పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

రాజమహేంద్రవరం : కోరుకొండ మండలం కణుపూరులో 95 మంది లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ఆదివారం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో సిఎం వైఎస్.జగన్ రాష్ట్రవ్యాప్తంగా 31.75 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మిస్తున్నారని ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా పేర్కొన్నారు. నవరత్నాలు పథకాల్లో భాగంగా అర్హత ఉన్న నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్టు చెప్పారు.

తహసీల్దార్‌కు ఘన వీడ్కోలు

దేవరపల్లి : విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందవచ్చునని తహసీల్దార్ యం.రామకృష్ణ అన్నారు. బదిలీపై వెళుతున్న రామకృష్ణను ఆదివారం మండల కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది మండలంలోని విఆర్‌ఒలు, విఆర్‌ఎలు ఘనంగా సన్మానించారు. ఆఫీస్ సిబ్బంది, సర్వేయర్లు, రేషన్ షాప్ డీలర్స్ పాల్గొన్నారు.

యూనియన్ నాయకుడిని సత్కరిస్తున్న సభ్యులు

సంఘం అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

మోటారు సైకిల్ మెకానిక్ యూనియన్ అభివృద్ధికి సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని స్కూటర్, మోటారు సైకిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కన్నారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పెద్దాపురం రోడ్డులోని లూథరన్ చర్చి గ్రౌండ్ సామర్లకోట లక్ష్మి గణపతి స్కూటర్, మోటారు సైకిల్ అసోసియేషన్ ఒకట్ల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి అసోసియేషన్ భవనం నిర్మాణానికి స్థలం సేకరించుకొని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం అయినందున నాయకులను కలసి వారి సహకారంతో స్థలం సేకరించుకోవాలన్నారు. ఇంకా సంఘంలో ఏమైనా చిన్నపాటి సమస్యలు ఉంటే వాటిని సామరస్యంగా పరిష్కరించుకుని ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఉండి ఇటీవల మృతి చెందిన తోట సత్తిబాబు మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ వ్యవస్థాపకులు నీలం త్రినాథ్‌మూర్తిని ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షులు ఎండి హనీఫ్, కార్యదర్శి అలక సాంబశివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కన్నారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలరామ్, శ్రీను, తిరుమలరావు, ప్రభ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పలు ఆటల్లో క్రీడాకారుల ప్రతిభ

చెక్కును అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీల్లో తాళ్లరేవు మండల క్రీడాకారులు పలు ఆటల్లో ప్రతిభను చాటి ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఫైనల్ పోటీల్లో క్రికెట్ (పురుషులు) తాళ్ళరేవు-1 సచివాలయం-రన్నర్ స్థానాన్ని, కోరంగి-2 సచివాలయం వాలీబాల్(పురుషులు) ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. గాడిమొగ-1సచివాలయం కోకో(మహిళలు) జిల్లా స్థాయిలో రన్నరప్‌గా నిలిచారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబు చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఇవిఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శులు విజెవి.రమణ, రమణమ్మ, రామరాజు, అభినందించారు.

హెల్త్ అసిస్టెంట్ మృతదేహానికి నివాళి

నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట

గుండెపోటుతో మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పొడుగు చిట్టిబాబు మృతదేహానికి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, వైసిపి సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు పాల్గొన్నారు. అలాగే చిట్టిబాబు మృతికి సంతాప సభను స్టేషన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు గిడుతూరి శ్రీను, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

నాటు సారా ఘటనపై కేసు నమోదు చేసినట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. మండలంలోని కేదార్లంక శివారు వీధివారి లంకలో నాటు సారా బట్టీపై తమ సిబ్బందితో కలసి దాడి చేశామని, బట్టీ నిర్వాహకుని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా, పాత్రలు, స్టవ్, గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకున్నట్టు ఎఐ తెలిపారు.

కేతాసాహెబ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-చాగల్లు

టిడిపి సీనియర్ నాయకులు, కేతాసాహెబ్ సోదరుని కుమార్తె ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్యుతరామయ్య ఆదివారం పరామర్శించారు. ఆళ్ల హరిశ్చంద్ర ప్రసాద్, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, బొల్లిన శివ నాగేంద్ర, దొంగ రామకృష్ణ పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురి చేరికలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి ఆదివారం పేర్చేర్ల పుల్లంరాజు వర్మ తన తో పాటు 95 కుటుంబ లతో పార్టీలో చేరారు. వీరికి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనందరావు మాట్లాడుతూచంద్రబాబు పరిపాలనా దక్షతపైన, నాపై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి తగు ప్రాముఖ్యత కల్పిస్తామని అన్నారు. అలాగే వర్మ తాత నరసింహరాజుతో తనకున్న అనుబంధాన్ని సత్యానందరావు గుర్తు చేసుకున్నారు. . ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకట్ రాజు, రాష్ట్ర తెలుగురైతు ప్రధానకార్యదర్శి ఆకుల రామకష్ణ, అమలాపురం పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

100 శాతం ఫలితాల సాధనే లక్ష్యం

ప్రజాశక్తితో ఆర్‌జెడి నాగమణి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని, పిల్లలను సరైన మార్గంలో పయనింపజేసేందుకు పక్కా ప్రణాళికతో విద్యా వ్యవస్థలో ప్రభుత్వ సమూల మార్పులు తీసుకొచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల విద్య రీజినల్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

10వ తరగతి పరీక్షలు ఎప్పటి నుంచి జరుగనున్నాయి?

సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్‌లో జరగనున్న నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ముందస్తుగానే 10వ తరగతి పరీక్షలు నిర్వహించనుంది. వచ్చే నెల 18 నుంచి 30 వరకూ పరీక్షలు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి.

10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏ విధంగా ఉంటుంది?

విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సంఖ్య పెంచుతాం. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తాం.

ఎన్ని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు?

కాకినాడ జిల్లా వ్యాప్తంగా 137 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందులో బి కేటగిరీలో 103, సి కేటగిరీలో 34 కేంద్రాలు ఉన్నాయి. 27,856 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యులర్‌లో బాలురు 13684 మంది, బాలికలు 14172 మంది ఉన్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి 19,802 మంది, తెలుగు మీడియం నుంచి 8054 మంది ఉన్నారు. వీరు కాకుండా ప్రయివేట్‌గా బాలురు 2415 మంది, బాలికలు 1959 మంది మొత్తంగా 4374 మంది ఉన్నారు. అన్ని సౌకర్యాలను సిద్ధం చేస్తున్నాం.

యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా?

సమ్మెటివ్ పరీక్షల అనంతరం విద్యార్థులను, పాఠశాలలను, మండలాలను గ్రేడులుగా విభజించాము. ఉదయం 9 గంటల నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయి. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల, మండలాల వారీగా సమీక్షలు, తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహిస్తున్నాం.

ప్రభుత్వ బడుల బలోపేతానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా సర్కారు బడుల రూపురేఖలు మారాయి. ఇప్పటికే తొలిదశ పూర్తి కాగా రెండో విడత పనులు కొనసాగుతున్నాయి. సుమారు రూ.69 కోట్లతో 882 పాఠశాలల్లో వివిధ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో కార్పొరేట్ తరహాలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. హెచ్‌ఎంలు ప్రతి 15 రోజులకోసారి తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించాలి. ప్రతి వారం ఉపాధ్యాయులతో హెచ్‌ఎం సమీక్షించడం తప్పనిసరిగా ఉండాలి.

కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చంటిబాబు

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలో పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాల తోపాటు, అధికారిక పర్యటనలకు ఆయన దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు నేపథ్యంతో ఆయన మరలా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలో ఇర్రిపాకలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికెను ప్రారంభిం చారు. అలాగే రామవరం, మర్రిపాక, ఇర్రిపాక గ్రామాలను కలిపే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన అనుచరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భవ నంలో నవభారత గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంగాడి రేవతి ఆధ్వర్యంలో కాకినాడ అపోలో హాస్పిటల్స్ వారి సహకా రంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రేవతి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు అంకాడి పూసలయ్య, సత్యవతిల ఆశయంతో బిఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రి భాయిల స్ఫూర్తితో పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వందలాది మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పరిసరాల శుభ్రత కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి - కాకినాడ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు సూచించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా విడిపోయి కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, పొడి చెత్తను సేకరించారు. దోమలకు నిలయమయ్యే చిత్తడి ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీస్‌లో కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

డిఎస్‌సిపై వాయిదా తీర్మానం పెడతాం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్‌పై తాము వాయిదా తీర్మానం పెడతామని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) తెలిపారు. సామర్లకోట నవభారత్ వెంచర్స్ అతిథి గృహంలో గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సివిల్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా గత 6 సంవత్సరాలుగా అది జరగక పోయినా ప్రస్తుత ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడిన కారణంగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అయితే రాష్ట్రంలో 50 వేల పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 6 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం విచారకరమన్నారు. ప్రతి ఏటా ఎంతమంది విద్యార్థులు చేరుతున్నారు, ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం అన్న విషయంపై దృష్టి పెట్టడం లేదన్నారు. దీనిపై త్వరలో జరగనున్న శాసన మండలి సమావేశంలో డిఎస్‌సిపై వాయిదా తీర్మానం చేయనున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మణరావు, ఐవి

ప్రణాళికా బద్ధంగా సిద్ధపడాలి

సివిల్స్‌కు సిద్ధపడుతున్న యువత యాధాలాపంగా గాక ప్రణాళిక బద్ధంగా, సిలబస్‌పై పట్టు సాధించే విధంగా సిద్ధపడాలని పలు కోచింగ్ సెంటర్‌ల అధ్యాపకులు సూచించారు. వందలాది మంది యువత పాల్గొన్న ఈ సదస్సులో వారు మట్లాడుతూ ప్రధానంగా అధిక సమయం వెచ్చించి పాత ప్రశ్న పత్రాలు, తెలుగు అకాడమి పుస్తకాలు సేకరించి వాటితో నోట్స్ తయారు చేసుకుని సిద్ధపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, పలు కోచింగ్ సెంటర్ల అధ్యాపకులు, అధిక సంఖ్యలో సివిల్స్ కు సిద్ధపడుతున్న యువత పాల్గొన్నారు.

వైసిపి పాలనకు గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - జగ్గంపేట

రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కాండ్రేగుల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రామిశెట్టి చంద్రరావు ఆధ్వర్యం లో పలువురు ఆదివారం టిడిపిలో చేరారు. అదేవిధంగా కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. వీరిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ జగన్ రెడ్డి నిరంకుశ పాలనకు ప్రజలందరూ చమర గీతం పాడడానికి సిద్ధంగా ఉన్నారని, ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా ఎప్పుడు వైసిపిని ఇంటికి పంపిందామని ఎదురుచూస్తున్నారని అన్నారు. టిడిపి, జనసేన కూటమికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నడే దుర్గ, యు.రాఘవరావు, కె.రామ్మూర్తి, కె.రాంబాబు, టి.తాతారావు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన జ్యోతుల నెహ్రూ

కొనసాగుతున్న దాళ్వా వరి నాట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

డిసెంబర్లో పూర్తి కావాల్సిన దాల్వా వరి నాట్లు ఫిబ్రవరి మొదటి వారం వరకు కొనసాగుతున్నాయి. మార్చి నెలాఖరులో పంట కాలువలకు సాగునీరు ప్రవాహం తగ్గిపోతుందని దీంతో డిసెంబర్ నెల వరకు నాట్లు పూర్తి చేసుకోవాలని ఇటు వ్యవసాయ శాఖ అటు ఇరిగేషన్ అధికారులు చెప్పిని క్షేత్రస్థాయిలో రైతులు దానిని అమలు చేయలేదు. మొదట్లో సాగునీరు ప్రవాహం తక్కువగా ఉండటంతో శివారు ప్రాంతాలు రైతులకు వరి నాట్లు వేసుకోవడం ఆలస్యమైంది. రామచంద్రపురం డివిజన్ పరిధిలో గల 17 వేల లో వరి సాగవు తుండగా, కె.గంగవరం మండలంలోని 16 వేల ఎకరాల్లో వరి పంటను పండిస్తున్నారు. డిసెంబర్లో మొదలైన దాళ్వా వరి నాట్లు ఇప్పటి వరకు కొనసాగడం విశేషం. డిసెంబర్‌లో నాట్లు వేసుకున్న రైతులు పంట పొలాల్లో కలుపులు తీస్తుండగా శివారు ప్రాంతాల రైతులు ఇంకా నాట్లు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 95శాతం నాట్లు పూర్తయ్యాయని మరో అయిదు శాతం ఈ వారంలో పూర్తి కావచ్చని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

జనవరి నెల వరకు 14 35 14 రకం ఎరువులు బస్తాకు రూ.1500 విక్రయించగా మరో రూ.200 పెరిగి ప్రస్తుతం రూ.17 వందల ధర పలుకుతూ ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడులు మరింత పెరుగుతాయని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై కె.గంగవరం మండలం వ్యవసాయ అధికారి పాత ధర రూ.1500 ఉండేదని ప్రస్తుతం కొత్త ధరలు అమల్లోకి రావడంతో రూ.1700కు చేరిందన్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఈ వారంలో నూరు శాతం నాట్లు పూర్తవుతాయని ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.

వేగాయమ్మ పేట వద్ద వరి నాట్లు వేస్తున్న కూలీలు

మోహనకు ఘన నివాళి

ప్రజాశక్తి-మామిడికుదురు

టిడిపి నాయకురాలు, ఎన్‌టిఆర్ అభిమాని మద్దుల మోహన ఇటీవల మృతి చెందారు. ఎన్‌టిఆర్ యువసేను అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య మానేపల్లిలో మద్దుల మోహన కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. మద్దుల మోహన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మద్దుల మోహన కుమార్తె టిడిపి రాష్ట్ర సోషల్ మీడియా నాయకురాలు అనురాజేశ్వరికి పరామర్శించారు. కార్యక్రమంలో దొమ్మేటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మద్దుల మోహన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుల్లియ్య

విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత

సబ్ డివిజన్‌లో ఒకరే అసిస్టెంట్ ఇంజినీర్

ప్రజాశక్తి-మండపేట

మండపేట సబ్ డివిజన్ పరిధిలో ఆలమూరు, రాయవరం, ద్వారపూడి, ఏడిద, మండపేట సెక్షన్లు ఉండగా వీటిలో ఏడిద సెక్షన్ కు మాత్రమే అసిస్టెంట్ ఇంజినీర్ ఉన్నారు. ఆయనే మండపేటకు ఇన్‌ఛార్జిగా కాగా మిగిలిన రాయవరం, ద్వారపూడి, ఆలమూరు సెక్షన్లకు సంబంధించి అక్కడ పనిచేసే జూనియర్ ఇంజినీర్లే ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అటు కార్యాలయంలోను ఇటు ఫీల్డ్ లోనూ జూనియర్ ఇంజినీర్లే పనులు చేయాల్సి వస్తుండడం దీంతో సకాలంలో పనులు జరగకపోవడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మండపేట సబ్ డివిజన్ కార్యాలయం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ఈ విషయంపై విద్యుత్ శాఖ రామచంద్రపురం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ వై.విజయానంద్ ను వివరణ కోరగా.. అసిస్టెంట్ ఇంజినీర్ల భర్తీ ప్రభుత్వం చేపట్టవలసిన ఉందని అన్నారు. అయితే ఇప్పటికే మండపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆయన అన్నారు.

పలు చోట్ల క్యాన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలు చోట్ల ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్యులు పాల్గొన్ని క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అమలాపురం క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నివారణ సులభమేనని అమలాపురం సాయి సంజీవినివాకర్స్ యోగ ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు నాని రాజు అన్నారు. అమలాపురం పట్టాభి వీధిలోని సాయి సంజీవిని ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహనా సదస్సులో నాని రాజు ప్రసంగించారు. ప్రపంచంలో అత్యధిక మరణాలు క్యాన్సర్ వల్లే సంభవిస్తున్నాయని అన్నారు. దీనికి ముఖ్యంగా అవగాహన లోపమే కనిపిస్తుందని అన్నారు. సదస్సులో ఆరోగ్య సంస్థ కార్యదర్శి బులిటెన్ ఎడిటర్ నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ క్యాన్సర్ పై రచించిన కవిత మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రంగా ముద్రించి గ్రామాల్లోఉదయం పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సంస్థ కోశాధికారి బివివి.సత్యనారాయణ మాట్లాడుతూ క్యాన్సర్ సోకిన వారికి మనోధైర్యం అవసరమని అన్నారు. సదస్సులో జాతీయ బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ, అల్లూరి అరుణ, ఎంబీఎన్.మహేశ్వరరావు, నాగరాజు, పి.గాయత్రి, వీరబాబు , కళాకారిణి దొడ్డి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా ర్యాలిలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. మనస్తత్వ వేత్త శ్యామ్ జాదూగర్ మాట్లాడుతూ సేంద్రియ ఆహారం తీసుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి దూరమవచ్చని అన్నారు. అనంతరం డాక్టర్ మోహిత్ ప్రతిరోజు చేసుకునే వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు.

అమలాపురంలో మాట్లాడుతున్న నాని రాజు

సదస్సుకు తరలిన పిఎంపిలు

మండపేట విజయవాడలో కమ్యూనిటీ పారామెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు మండపేట నుంచి పిఎంపిలు ఆదివారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని పి ఎం పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, వానపల్లి కనకరాజు, మేకా రామకృష్ణ తదితరులు తరలి వెళ్లారు.

మండపేట నుంచి విజయవాడలో జరిగే సదస్సుకు వెళుతున్న పిఎంపిలు

ఆలయ పునఃప్రతిష్ట ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మామిడికుదురు

ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ అమ్మ వారి ఆలయ పునః ప్రతిష్ట ఆహ్వాన పత్రికను ఆదివారం నిర్వహక కమిటీ, స్థానికులు ఆవిష్కరించారు. ఈ నెల 20 నుంచి 22వరకు ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 20, 21 తేదీల్లో హోమాలు, 22న విగ్రహ పున్ణప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

'ప్రత్యేక హోదా'కు కట్టుబడి ఉన్న కాంగ్రెస్

ప్రజాశక్తి-మండపేట

కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందని డిసిసి అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. బిజెపి దుర్మార్గపు ఆలోచనకు అడ్డుకట్ట వేయాలన్న, విశాఖ ప్లాంట్ జాతీయ పరంగా ఉండిపోవాలన్నా, విభజన చట్టంలో హామీలన్నీ నెరవేరాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరారు. హోదా సాధన కోసం ఢిల్లీలో పిసిసి అధ్యక్షు రాలు వైఎస్.షర్మిల నాయకత్వంలో ఆంధ్రాలో పార్టీ అగ్ర నాయకులంతా ఆందో ళన చేశారన్నారు. ధర్నాకు ముందు ఎన్‌సిపి, డిఎంకె, సిపిఎం, సిపిఐ నేతలను కలిసి హోదాకు మద్దతు కోరామన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం. 246/2022

బిట్వీన్:
సావిటి నాగరాజు -వాది
మరియు
దాసరి రాంబాబు, (తండ్రి) వీర్రాజు, వృత్తి: వ్యాపారం, రెసిడెంట్ ఆఫ్ : డోరు నెం. 6-24, మార్కెట్ వీధి, జగ్గంపేట టౌన్ & మండలం, కాకినాడ జిల్లా. -ప్రతివాది

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీకు వాది ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపియున్ననూ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున వాది కోరిక మేరకు శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు పబ్లికేషన్ రూపములో దావా సమన్లు అందజేయమని ఆర్డర్ వేసియున్నారు. సదరు కేసు **ది. 20-02-2024 తేదీకి వాయిదా అయివున్నది.** పై తేదీన కోర్టు యందు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ **ఉదయం 10.30 నిమిషములకు** కోర్టు ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున దావా పరిహారములు పరిష్కరించబడును.

షేక్ వల్లీ బాబు
సెల్: 9948012322
కాపిశెట్టి శ్రీనివాసరావు
స్థలం: పెద్దాపురం సెల్: 9948132864
ది.04-02-2024 న్యాయవాదులు, పెద్దాపురం

ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం. 246/2022
ఐ.ఎ. నెం. 721/2022

బిట్వీన్:
సావిటి నాగరాజు -వాది
మరియు
దాసరి రాంబాబు, (తండ్రి) వీర్రాజు, వృత్తి: వ్యాపారం, రెసిడెంట్ ఆఫ్ : డోరు నెం. 6-24, మార్కెట్ వీధి, జగ్గంపేట టౌన్ & మండలం, కాకినాడ జిల్లా. -ప్రతివాది

పై నెంబరు ఐ.ఎ.లో ప్రతివాది అయిన మీకు వాది ఎన్ని పర్యాయములు దావా నోటీసులు పంపియున్ననూ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున వాది కోరిక మేరకు శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు పబ్లికేషన్ రూపములో దావా నోటీసులు అందజేయమని ఆర్డర్ వేసియున్నారు. సదరు కేసు **ది. 20-02-2024 తేదీకి వాయిదా అయివున్నది.** పై తేదీన కోర్టు యందు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ **ఉదయం 10.30 నిమిషములకు** కోర్టు ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున దావా పరిహారములు పరిష్కరించబడును.

షేక్ వల్లీ బాబు
సెల్: 9948012322
కాపిశెట్టి శ్రీనివాసరావు
స్థలం: పెద్దాపురం సెల్: 9948132864
ది.04-02-2024 న్యాయవాదులు, పెద్దాపురం